క్లుప్తంగా

రేపు కబడ్డీ జట్ల ఎంపిక

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సబ్ జూనియర్ బాల బాలికల కబడ్డీ జట్ల ఎంపిక ఉప్పునుంతల మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్టూర్‌లో ఉదయం 8 గంటలకు నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం జనార్దన్‌రెడ్డి, యాదయ్యగౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు వచ్చే క్రీడాకారులు తేదీ 30.11.2009 తర్వాత జన్మించిన బాల బాలికలు, 55 కిలోల లోపు బరువు కలిగి ఉండి ఆధార్ కార్డు, బోనఫైడ్ సర్టిఫికెట్‌తో హాజరు కావాలన్నారు. ఎంపికలకు వచ్చే క్రీడాకారులు ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.రమేష్ 9951629694, మోహన్ లాల్ 9912524385 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కల్వకుర్తి రూరల్: జిల్లా సబ్ జూనియర్ బాల బాలికల కబడ్డీ జట్ల ఎంపిక ఈనెల 13న ఉప్పునుంతల మండలం వెల్టూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి కార్యదర్శి యాదయ్య గౌడ్ తెలిపారు. ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్ జిరాక్స్, పదో తరగతి మెమో తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు 9951629694, 9912524385 నంబర్లను సంప్రదించాలని యాదయ్య గౌడ్ కోరారు.

కొల్లాపూర్‌లో భారీవర్షం

కొల్లాపూర్: కొల్లాపూర్‌లో గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జోరువాన కురిసింది. రోజంతా చినుకులు పడ్డాయి. బుధవారం రాత్రి 30.4 మి.మీ.గా న మోదైంది. వర్షం కారణంగా వాగుల్లో ఉధృతంగా నీళ్లు ప్రవహించాయి. వర్షం వల్ల మొక్కజొన్న పంటలకు మేలు జరిగింది. మండలంలో ఎటువంటి పంటనష్టం చోటుచేసుకోలేదని వ్యవసాయ అధికారులు తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

బిజినేపల్లి/తెలకపల్లి: జిల్లా న్యాయమూర్తి, డీఈఓ ఆదేశానుసారం మండల కేంద్రాల్లో అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బాల్య వివాహాలు, పరిణామాలు, చట్టపరమైన రక్షణ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాస రచన పోటీల సందర్భంగా 9, 10 తరగతుల నుంచి 26 మంది విద్యార్థులు హాజరుకాగా, 11 మంది విద్యార్థులు ఉపన్యాస పోటీల్లో పాల్గొన్నారు. ఎంఈఓ రఘునందన్‌రావు ఉన్నారు.

- తెలకపల్లిలో వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: వ్యక్తి అదృశ్యం కావడంతో గురువారం కేసు నమోదైనట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. కోడేరు మండలం జనుంపల్లికి చెందిన కార్తీక్ తల్లిదండ్రులతో కలిసి చాలా రోజులుగా జిల్లా కేంద్రంలో నివాసం ఉంటున్నాడు. కార్తీక్ జూలై 4న ఇంటి నుంచి ఎక్కడికో వెళ్లిపోయాడు. కుటుంబసభ్యులు అతని కోసం ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తెలకపల్లి: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం లింగాల మండలం రాంపూర్ గ్రామానికి చెందిన ఆటోలో పదిమంది ప్రయాణికులతో తెలకపల్లికి వస్తుండగా, గోలగుండం- గౌరెడ్డిపల్లి గ్రామాల మధ్య ఎదురుగా వస్తున్న కారు, ఆటో ఢీకొన్నాయి. దీంతో ఆటో రోడ్డు దిగి పొలాల్లోకి వెళ్లి బోల్తా పడింది. ఆటోలో ఉన్న చెన్నమ్మ, విద్యార్థిని శిరీషకు తీవ్ర గాయాలయ్యాయి. మిగతా వారికి స్వల్ప గాయాలైనట్లు ఎస్‌ఐ తెలిపారు. విషయంపై దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వాగులో చిక్కుకున్న సెంట్రింగ్ కూలీలు

అచ్చంపేట రూరల్: వాగులో చిక్కిన సెంట్రింగ్ కూలీలను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని మన్నెవారిపల్లి సమీపంలో డిండి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం పోలెపల్లి బండతండాకు చెందిన సెంట్రింగ్ కూలీలు గురువారం ఉదయం మండలంలోని ఘనపూర్, ఆంజనేయతండాలో సెంట్రింగ్ పనులకు వెళ్లారు. సాయంత్రం తిరుగుప్రయాణంలో వాగు వద్ద నీటి ఉధృతిని గమనించకుండానే ట్రాక్టర్‌లో అటు వైపు వెళ్లారు. పరిస్థితిని గమనించి కేకలు వేయడంతో స్థానికులు సిద్ధాపూర్ ఎస్‌ఐ పవన్‌కుమార్‌కు సమాచారం అందించారు. వెంటనే జేసీబీ సాయంతో వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. వరద ఉధృతి అధికంగా ఉందని రాకపోకలను బంద్ చేయనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేడు విశ్రాంత ఉద్యోగుల సంఘం ఎన్నికలు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో శుక్రవారం సంఘం ఎన్నికలను నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చిన్నయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధికారులు ఎన్నికలను నిర్వహిస్తారని తెలిపారు. విశ్రాంత ఉద్యోగులందరూ హాజరై 2025–28 కాలానికి నూతన కార్యవర్గం ఎన్నుకోవాలని వారు కోరారు.

బాలికల హాస్టల్లో సమస్యల తిష్ట


వెల్దండలోని ప్రహరీ లేని గిరిజన బాలికల కళాశాల హాస్టల్

- కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల హాస్టల్‌కు దారే లేదు
- ఇబ్బందుల్లో గిరిజన కళాశాల బాలికలు

వెల్దంద: మండల కేంద్రంలోని గిరిజన కళాశాల బాలికల వసతి గృహంలో మౌలిక వసతులు కరువయ్యాయి. విద్యార్థినులకు వసతుల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హాస్టల్లో మొదటి సంవత్సరంలో 62 మంది, రెండో సంవత్సరంలో 40 మంది విద్యార్థినులు ఉంటున్నారు. వీరంతా వివిధ ప్రాంతాల నుంచి వచ్చి వసతిగృహంలో ఉండి ప్రభుత్వం జూనియర్ కళాశాల, మోడల్ ఆదర్శ కళాశాలల్లో ఇంటర్మీడిట్ చదువుతున్నారు. ప్రభుత్వం వసతులు కల్పిస్తున్నట్లు చెబుతున్నా ఆచరణలో అమలుకావడం లేదు. దీంతో విద్యార్థినుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వసతి గృహంలో తాగునీటి ఇబ్బంది పడుతున్నారు. గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. హాస్టల్‌కు ప్రహరీ లేకపోవడంతో విద్యార్థినులకు రక్షణ కరువైంది. చుట్టూ గుట్టలు, చెట్లు ఉండడంతో రాత్రి వేళల్లో హాస్టల్ ఆవరణలోకి విషకీటకాలు వస్తున్నాయి. దీంతో విద్యార్థినులు భయాందోళనకు గురవుతున్నారు. ఆవరణంలో విద్యుత్ లైట్లు లేక చీకట్లో ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వసతి గృహం ఆవరణలో హైమస్ట్ లైట్లు ఏర్పాటు చేసి సమస్య తీర్చాల్సి ఉంది. విద్యార్థులకు బెడ్ మంచాలు అందించకపోవడంతో కిందనే నిద్రిస్తున్నారు.

ఐదేళ్లుగా ప్రహరీ నిర్మించడం లేదు

కళాశాల హాస్టల్ విద్యార్థినులు సమస్యలను చాలా సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ఐదేళ్లుగా ప్రహరీ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. భవన నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల హాస్టల్‌కు వెళ్లడానికి కనీసం దారి కూడా ఏర్పాటు చేయలేదు. శ్మశాన వాటిక స్థలాల నుంచి విద్యార్థులు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దారి లేక హాస్టల్‌కు వచ్చే సరుకుల వాహనాలు దూరంగా ఉంచి సరుకులను సిబ్బంది మోసుకెళ్తున్నారు. నిధులు ఉన్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వహించి పనులు చేపట్టలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పట్టించుకొని కళాశాల హాస్టల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



గిరిజన కళాశాల హాస్టల్లో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మొదటి, ద్వితీయ సంవత్సరంలో మొత్తం 102మంది విద్యార్థినులు ఉన్నారు. నీటి సమస్య, ప్రహరీ, రోడ్డు సౌకర్యం లేక చాలా ఇబ్బందిగా ఉంది. హాస్టల్ ఆవరణలో హైమస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని అధికారులకు దృష్టికి తీసుకెళ్లాం. విద్యార్థినులకు బెడ్ మంచాలు మంజూరయ్యాయి. మన్ననూర్ ఏటీడీఓ పాయింట్ వద్ద ఉన్నట్లు అధికారులు తెలిపారు. త్వరలోనే వాటిని తీసుకొస్తాం.

– జాన్సన్ బాబు, హాస్టల్ వార్డెన్, వెల్దండ

ప్రహరీ లేక భయం..భయం..



హాస్టల్‌కు ప్రహరీ లేకపోవడంతో రాత్రి వేళల్లో భయం భయంగా ఉంటుంది. సమస్యలు ఉన్నప్పటికీ సర్దుకోని పోతున్నాం. ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు ఆస్పత్రికి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నాం. ప్రత్యేక హాస్టల్‌కు ఏఎన్ఎంలను నియమించాలి. ఉన్నతాధికారులు దృష్టి పెట్టి మా సమస్యలు పరిష్కరించాలి.

– అఖిల, మొదటి సంవత్సరం విద్యార్థిని, వెల్దండ

విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలి



వసతి గృహంలో లైట్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. రాత్రి వేళల్లో విద్యుత్ సమస్య ఉంటోంది. అధికారులు స్పందించి వసతి గృహ ఆవరణలో హైమస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలి. బోరు ఉన్నప్పటికీ నీటిమట్టం పడిపోవడంతో సమస్య తీవ్రంగా ఉంది. హాస్టల్ ఆవరణ రాళ్లతో ఉండడంతో ఇబ్బందిగా ఉంది. హాస్టల్‌కు వెళ్లడానికి దారి లేక ఇబ్బందులు పడుతున్నాం. విద్యుత్ సమస్యను పరిష్కరించాలి.

– ఇందు, ద్వితీయ సంవత్సరం విద్యార్థిని, వెల్దండ

రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం


స్ప్రింక్లర్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

వంగూరు: రైతులకు అన్ని రకాలుగా రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. గురువారం మండల పరిధిలోని డిండిచింతపల్లి గ్రామంలో రైతులకు స్ప్రింక్లర్ సెట్ల పంపిణీతో పాటు రేషన్‌కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన సాగునీరు, విద్యుత్‌తో పాటు రైతు రుణమాఫీ, రైతుభరోసా, సబ్సిడీపై విత్తనాలు, వ్యవసాయ పరికరాలు అందిస్తున్నట్లు తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, రమేష్‌గౌడ్, అల్వాల్ రెడ్డి, విష్ణు, సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుల గోస పట్టడం లేదు


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అచ్చంపేట రూరల్: రైతులకు యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలమైందని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దేశ్యానాయక్ ఆరోపించారు. గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా దేశ్యానాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వానికి రైతుల గోస పట్టడం లేదన్నారు. తెల్లవారుజామున పీఏసీఎస్ కేంద్రాలు, ఇతర దుకాణాల వద్ద రైతులు బారులు తీరుతున్నారన్నారు. అనంతరం తహసీల్దార్ సైదులుకు వినతిపత్రం అందజేశారు. నాయకులు రాములు, ఆంజనేయులు, బాల్య, రెడ్యా, విజయ్ ఉన్నారు.

యూరియా సరఫరా చేయాలని ధర్నా


కోడేరులో యూరియా కోసం ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

కోడేరు: రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం సింగిల్ విండో వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం రాష్ట్రానికి అవసరమైన యూరియా అందించడంలో ఘోరంగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో కేంద్ర మంత్రులు ఉన్నా రాష్ట్ర రైతాంగానికి సరిపడా యూరియా కేంద్రం నుంచి తెప్పించడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. వెంటనే ప్రభుత్వం స్పందించి రైతులకు కావాల్సిన యూరియాను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాములు, రాజేష్, బాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

లింగాల: యూరియా కోసం రైతులు పడుతున్న తంటాలు ఇంకా తగ్గడం లేదు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ దగ్గర యూరియా కోసం రైతులు తరలివచ్చారు. గతంలో ఎకరాకు ఒక బస్తా ఇచ్చిన అధికారులు ప్రస్తుతం రెండు నుంచి మూడు బస్తాల వరకు పంపిణీ చేశారు. ప్రైవేటు ఫెర్టిలైజర్ డీలర్లు యూరియా విక్రయాలలో అక్రమాలకు పాల్పడుతున్నారు. లింగాల, అంబట్‌పల్లి, రాంపూర్‌లో కొంతమంది డీలర్లు గుట్టు చప్పుడు కాకుండా రాత్రి సమయంలో యూరియా విక్రయాలను కొనసాగించడమే గాక, ఒక్కో బస్తాను రూ. 400 నుంచి 420ల వరకు విక్రయిస్తున్నారు.

వరి పంటను పరిశీలించిన అధికారులు


ఎన్మన్‌బెట్లలో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఎన్మన్‌బెట్ల గ్రామంలో రైతులు సాగు చేసిన వరి పంటను పాలెం వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త రాజశేఖర్, మండల వ్యవసాయాధికారి చిన్న హుస్సేన్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ప్రస్తుతం వరిలో సూక్ష్మధాతు లోపాలు గమనించారు. నివారణకు ఫార్ములా 4-250 గ్రాములు, ఎకరానికి స్ప్రే చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ విస్తరణ అధికారి కురుమూర్తి, రైతులు ఉన్నారు.

మొకురాల స్వర్ణలతకు డాక్టరేట్



పెద్దకొత్తపల్లి: పెద్దకొత్తపల్లి మండలం చంద్రకల్ గ్రామానికి చెందిన మొకురాల రామేశ్వర శర్మ, సరోజ దంపతుల చిన్న కుమార్తె స్వర్ణలత డాక్టరేట్ అందుకున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ డిగ్రీ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా స్వర్ణలత పనిచేస్తున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లా పెబ్బేరుకు చెందిన ప్రముఖ కథా రచయిత వల్లపురెడ్డి బుచ్చారెడ్డి సాహిత్యంపై చేసిన పరిశోధనకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆమెకు డాక్టరేట్ ప్రదానం చేసింది. ప్రొఫెసర్ ఎస్.రజినీ పర్యవేక్షణలో 'వల్లపురెడ్డి బుచ్చారెడ్డి జీవితం, సాహిత్యం' అనే అంశంపై స్వర్ణలత పరిశోధన జరిపారు. త్వరలో జరగనున్న స్నాతకోత్సవంలో గవర్నర్ చేతులమీదుగా స్వర్ణలత డాక్టరేట్ పట్టా అందుకోనున్నారు.

పీజీ సెంటర్ ప్రిన్సిపాల్‌కు సన్మానం

కొల్లాపూర్: కొల్లాపూర్‌లోని ప్రభుత్వ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ మార్క్‌పోలోనియస్‌ను ఎస్ఎఫ్ఐ, బీఆర్ఎస్వీ విద్యార్థి సంఘాల నాయకులు గురువారం సత్కరించారు. ఆయన ఇటీవల పాలమూరు యూనివర్సిటీ తెలుగు విభాగం అధ్యక్షులుగా నియమితులయ్యారు. దీన్ని స్వాగతిస్తూ విద్యార్థి సంఘాల నాయకులు ఆయనను సత్కరించారు. ఎస్ఎఫ్ఐ వనపర్తి జిల్లా కార్యదర్శి ఎం.ఆది, ఉపాధ్యక్షులు రామ కృష్ణ, బీఆర్ఎస్వీ జిల్లా నాయకులు డి.శేఖర్ ఉన్నారు.

'స్టాఫ్ కౌన్సిల్ ఏర్పాటుపై హర్షం'

అచ్చంపేట: తెలంగాణ సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ (టీసీఎస్‌జేఎస్సీ)ని ఏర్పాటు చేయడం పట్ల జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మురళి, కొత్త శ్రీధర్ రావులు హర్షం వ్యక్తం చేశారు. దీని వల్ల రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ప్రతి నాలుగు నెలలకు ఒక మారు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం పెద్దలతో ప్రభుత్వ అధికారులు 30మంది సభ్యులుగా సమావేశమై పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించుటకు మార్గం సుగమమైందన్నారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో సంఘ ప్రతినిధులు హనుమంత రెడ్డి, వి.సుదర్శన్, ఈశ్వర్, రమేష్, సతీష్, రవి శేఖర్, వి.సత్యనారాయణ, ప్రభాకర్, విశ్రాంత ఉపాధ్యాయులు ఎం.సుదర్శన్ ఉన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

కోడేరు: జిల్లాలో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి తక్షణమే నిర్మాణం చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలో మంజూరు ఇళ్ల నిర్మాణం ఇంకా చేపట్టలేదన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు నర్సింహ, రవి, వెంకటయ్య పాల్గొన్నారు.

దళితబంధు పంపిణీ చేయాలి

చారకొండ: రెండో విడత దళితబంధు యూనిట్లను పంపిణీ చేయాలని మండలంలోని చంద్రాయన్‌పల్లి, గోకారం, ఎర్రవల్లి, జూపల్లి, శేరిఅప్పారెడ్డిపల్లి, సిర్సనగండ్ల గ్రామాలకు చెందిన 2వ విడత దళిత బంధు లబ్ధిదారులు గురువారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల దళితబంధు, లబ్ధిదారులు కోట్ర గణేష్, రమేష్, శేఖర్, కిరణ్, రాకేష్ ఉన్నారు.

రెవెన్యూ సదస్సులో దరఖాస్తులను పరిష్కరించాలి


వెల్దండలో రెవెన్యూ అధికారులతో సమావేశంలో మాట్లాడుతూ కల్వకుర్తి ఆర్డీఓ జనార్దన్‌రెడ్డి

వెల్దంద: ప్రభుత్వం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతులు ఫిర్యాదు చేసిన దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని కల్వకుర్తి ఆర్డీఓ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం వెల్దండ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ పరిధిలోని వెల్దండ, కల్వకుర్తి, చారకొండ, వంగూర్, ఊర్కొండ మండలాల్లో 73 రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించిన సమయంలో వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి పరిష్కరించే విధంగా చూడాలని ఆయన సూచించారు. ప్రజావాణిలో రైతులు ఫిర్యాదు చేసిన దరఖాస్తులను సిబ్బంది ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించాలని పేర్కొన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కార్తీక్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్, హరీందర్‌రెడ్డి, ఆర్ఐ శంకర్‌నాయక్ ఉన్నారు.

హిందీభాషా జాతీయ సమైక్యతకు తోడ్పడుతుంది


సాతాపూర్ ఉన్నత పాఠశాలల్లో హిందీ ఉపాధ్యాయులకు సన్మానం

పెద్దకొత్తపల్లి: సాతాపూర్ ఉన్నత పాఠశాలల్లో గురువారం ఘనంగా హిందీభాషా దినోత్సవం నిర్వహించారు. హెచ్ఎం శ్రీశైలం మాట్లాడుతూ హిందీ భాషా జాతీయ సమైక్యతకు తోడ్పడుతుందన్నారు. హిందీభాషను నేర్చుకోవడం ద్వారా వివిధ రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందవచ్చు అన్నారు. హిందీ జూనియర్ లెక్చరర్‌గా నియామకం అయిన స్వాతిని, హిందీ ఉపాధ్యాయులను ఈ సందర్భంగా శాలువాలతో సన్మానం చేశారు. కార్యక్రమంలో గౌస్‌పాషా, తిమ్మారెడ్డి, షాకీర్‌పాషా, వెంకటప్ప, శ్రీలత, మంజుల, నాగయ్య, షఫీ, కిశోర్, సుజాత, కృష్ణవేణి, జమీల్, జరీనా పాల్గొన్నారు.

ఉప్పునుంతల: జాతీయ స్థాయిలో హిందీ భా షాకు ప్రాముఖ్యత ఉన్నందున ఉపాధ్యాయులు హిందీ బోధనపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి అన్నా రు.

క్రీడలతో మానసికోల్లాసం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ భాస్కర్‌రెడ్డి

కందనూలు: క్రీడలు విద్యార్థులకు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఎంఈఓ భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ విద్య ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయులకు తొలిసారి స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించడం చాలా ఆనందించదగ్గ విషయమన్నారు. ఈ సమావేశాల ద్వారా విద్యార్థులకు ఎలాంటి నైపుణ్యంతో కూడిన క్రీడలు ఆడించాలనే విషయాలను తెలుసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ నియోజక వర్గాల వ్యాయామ విద్య ఉపాధ్యాయులు హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ పర్సన్ నిరంజన్ యాదవ్, సామ రమేష్, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధిక వర్షాలకు జాగ్రత్తలు తీసుకోవాలి


వెంకటాపూర్‌లో మిరుపనారును పరిశీలిస్తున్న అధికారి

తాడూరు: ఇటీవల కురుస్తున్న అధిక వర్షాలకు ఉద్యానవన పంటలతో పాటు మిరపనారు వంటి పంటలు తెగుళ్ల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను జిల్లా ఉద్యానవన అధికారి జగన్ రైతులకు వివరించారు. గురువారం మండలంలోని మేడిపూర్, వెంకటాపూర్ గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ఉద్యాన పంటలు కురగాయతోటలు, పూలు, మిర్చి, తోటలు, నారు మడులు కురగాయ నారు మడులలో తగిన జాగ్రత్తలు తీసుకొని అధిక వర్షాల నుండి కాపాడుకోవాలన్నారు. టమాటో వంటి పంటల్లో తప్పని సరిగా స్టేకింగ్ విధానం పాటించాలన్నారు.

కేఎల్ఐ కాల్వ మార్పిడిపై రైతుల వినతి

ఉప్పునుంతల: మండలంలోని వెల్టూరు శివారులో కొత్తగా తవ్వడానికి తలపెట్టిన కెఎల్ఐ డీ-1 (ఎల్) మైనర్ కాల్వ తమ పొలాల నుంచి కాకుండా మార్పు చేయాలని గ్రామానికి చెందిన రైతులు వెంకటేష్, సత్యనారాయణ, బాలరాజు, శేఖర్, కురుమయ్య, మల్లయ్య, నాగార్జున, బాల్‌రాం తదితరులు గురువారం అచ్చంపేటలో ఇరిగేషన్ ఈఈకి వినతిపత్రం అందజేశారు. సర్వే నంబర్ 211, 212 నుంచి కాల్వ తీయడం వల్ల తీవ్రంగా నష్టపోవల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తిరిగి సర్వే నిర్వహించి తాము నష్టపోకుండా చూడాలని వారు కోరారు.

ఫొటో ఎక్స్‌పో వాల్‌పోస్టర్ విడుదల

లింగాల: హైదరాబాద్‌లోని నార్సింగ్‌లో ఈ నెల 19 నుంచి 21 వరకు మూడు రోజుల పాటు నిర్వహించే ఫొటో ఎక్స్‌పో వాల్‌పోస్టర్‌ను గురువారం మండల ఫొటో గ్రాఫర్ల సంఘం ఆధ్వర్యంలో ఎస్‌ఐ వెంకటేశ్వర్‌గౌడు విడుదల చేశారు. కార్యక్రమంలోని మండలంలోని ఫొటో గ్రాఫర్‌లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సంఘం అధ్యక్షుడు మెరుగు భాస్కర్ కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కృష్ణ తాలూకా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.గిరి, ఎం.శివ, సంఘం నాయకులు పాల్గొన్నారు.

తాడూరు: ఈ నెల 19, 20, 21న హైదరాబాద్‌లో ఫొటో ట్రేడ్ ఎక్స్‌పోలో దేశవ్యాప్తంగా ఫొటో, వీడియో టెక్నాలజీ కంపెనీలు, నూతన పరికరాలు, సాఫ్ట్‌వేర్లు ట్రైనింగ్ ప్రోగ్రాంలు ప్రదర్శించనున్నట్లు ఫొటోగ్రాఫర్ల సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఫొటో ఎక్స్‌పో పోస్టర్‌ను ఎస్‌ఐ గురుస్వా మి ఆవిష్కరించారు. ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు శ్రీకాంత్, శివ, శ్రీను, షబ్బీర్ పాల్గొన్నారు.

'గ్రూప్-1 రద్దు చేయడం బాధాకరం'

కందనూలు: గ్రూప్–1 రద్దు కావడం బాధాకరమని ఫిట్ ఇండియా నాయకుడు విష్ణువర్ధన్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ హాల్లో మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాల నుంచి నిరుద్యోగులు కష్టపడి చదివి పరీక్ష రాసి ఉద్యోగం వచ్చాక రద్దు చేయడం బాధాకరమని అన్నారు. నిరుద్యోగుల జీవితాలతో టీజీపీఎస్సీ చెలగాటం ఆడటం సమంజసం కాదన్నారు. అవకతవకలకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శివశంకర్, రాము, బాలపీరు తదితరులు పాల్గొన్నారు.

బియ్యం సరఫరాలో తేడా రావొద్దు

బిజినేపల్లి: రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులకు పంపిణీ చేసే బియ్యం సరఫరాలో, నిల్వ ఉన్న బియ్యంలో ఎలాంటి వ్యత్యాసాలు లేకుండా చూడాలని డీఎస్ఓ నరసింహారావు సూచించారు. గురువారం మండలంలోని నందివడ్డెమాన్‌లోని రేషన్ దుకాణాన్ని డీఎస్ఓ ఆకస్మిక తనిఖీ చేశారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

మన్ననూర్: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు ఆకర్షితులై బీఆర్ఎస్, బీజేపీల నుంచి నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. గురువారం మన్ననూర్‌లోని బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు సతీష్ ముదిరాజ్ తన అనుచరులతో కలిసి అచ్చంపేటలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రజాభవన్‌లో ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అ మ్రాబాద్, బల్మూర్, లింగాల, ఉప్పునుంతలతో పా టు అచ్చంపేట మండలాల నుంచి అనేక మంది నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే

వంగూరు: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు చట్టప్రకారమే ఇవ్వాలని బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని గాజర గ్రామంలో పలువురు బీసీ నాయకులతో సమావేశం అయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 శాతం స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ సాధించేందుకు ఈనెల 20న వంగూరు గేట్‌వద్ద ఉన్న వైవి ఫంక్షన్‌హాల్లో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ఉద్య మ కార్యాచరణను ప్రకటిస్తామని ఆయన అన్నారు. వెంకటేష్ యాదవ్, మల్లేష్ యాదవ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాడూరు: మండలంలోని మేడిపూర్ ప్రత్యేక లైన్‌కు సంబంధించి మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి 1.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఏఈ శ్రీరాములు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని తెలిపారు. మేడిపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఆకునెల్లికుదురు, నాగదేవపల్లి, ఎంగంపల్లి, అల్లాపూర్, పోల్కూ రు గ్రామాలకు సరఫరా నిలిపేస్తున్నట్లు పేర్కొన్నారు.

వైద్యుడిపై చర్య తీసుకోవాలి

తెలకపల్లి: మండలంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రి వైద్యుడిపై చర్య తీసుకోవాలని బాధితులు డీఎంహెచ్ఓ ఫిర్యాదు చేశారు. తెలకపల్లికి చెందిన బారిగారి రాధిక గురువారం డీఎంహెచ్ఓకు ఫి ర్యాదు చేసింది. ఆగస్టు 4న చిన్నముద్దునూరు వద్ద ఎద్దు పొడవడంతో రాధిక తండ్రికి గాయాలయ్యా యి. అతనిని తెలకపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందించారు. గాయపడిన చోట కుట్లు వేసినట్లు తెలిపారు. గతనెల 31న బాధితుడు చనిపోయాడు. ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం వల్లనే తన తండ్రి చనిపోయినట్లు ఆమె పేర్కొంది. ఆస్పత్రి వైద్యుడిపై చర్య తీసుకోని తమకు న్యాయం చేయాలని ఆమె డీఎంహెచ్ఓకు ఫిర్యాదు చేసింది.